

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**లగ్‌తా నహీహై దిల్ మేర ఉజ్డే దయార్ మే**

**కిస్‌కీ బనీహై ఆలం – ఎ –నా – పాఎదార్ మే.**

ఆఖరి మొఘల్ రాజు 'బహదూర్ షాహ జాఫర్' జీవితం ఆధారంగా 1960లో రూపొందించిన సినిమా లాల్‌ఖిలా. పైడి జయరాజ్ బహదూర్ షా జాఫర్‌గా నటించిన సినిమా ఇది. ఈ సినిమాలో బహదూర్ షా జాఫర్ నిజ జీవితంలో రచించిన ఈ గజల్‌ను వాడుకున్నారు. ఎస్.ఎన్.త్రిపాఠీ సంగీత కల్పన చేయగా, మహమ్మద్ రఫీ ఎంతో గొప్పగా అణువణువునా విషాదం నిండిన పదాలకు ప్రాణం పోస్తూ, మరింత విషాదాన్ని, వేదనను జోడించి పాడిన పాట ఇది.

బహదూర్ షా జాఫర్ తనకు అంత్యకాలం సమీపిస్తోందని గ్రహిస్తాడు. 1857, ప్రథమ స్వాతంత్ర్య పోరాటం విఫలమవటంతో బ్రిటీష్ వారు బహదూర్ షాను ఢిల్లీనుంచి బర్మాలో రంగూన్‌కు తరలిస్తారు. అక్కడ దాదాపుగా గృహనిర్బంధంలో ఉంచుతారు. బ్రిటీష్ వారిచ్చే భరణంతో బ్రతుకుతూ, మరణం కోసం ఎదురు చూస్తూంటాడు. నిరాశతో, దుర్భరమైన విషాదంలో బ్రతుకుతూంటాడు. ఆ సమయంలో అతడు తన నిరాశను, ఆవేదనను కవితలలో ప్రతిబింబించాడు. కవితలను గోడలపై రచించాడు. అతడికి తెలుసు, తన మరణం తరువాత తన శవాన్ని రంగూన్‌లోనే ఎవరికీ తెలియని విధంగా, ఎలాంటి గుర్తులు లేకుండా ఎక్కడో పాతిపెడతారని. తాను రాజ్యం చేసి ప్రాణప్రదంగా ప్రేమించిన ఢిల్లీ నగరం నేలపై కనీసం రెండు గజాల భూమికూడా తనను పాతిపెట్టటానికి లభించదని అతనికి తెలుసు. ఢిల్లీని మళ్లీ తాను చూడలేనని, ఢిల్లీలో అడుగుపెట్టలేననీ తెలుసు. ఆ నిరాశలోంచి పెల్లుబికి వచ్చిన విషాద గీతిక ఈ పాట.

'దయార్' అంటే ప్రాంతం, నేల, దేశం వంటి అర్థాలున్నాయి. 'లగ్ తా నహీ' అంటే ఈ నాశనమైపోయిన శిథిలాల ప్రాంతంలో వేరే దేశంలో తన మనసుకు నచ్చటంలేదని అర్థం. బహదూర్ షా జాఫర్ ఢిల్లీ సుల్తాన్. భారత దేశంపై రాజ్యం చేసినవాడు.

చివరకి బర్మాలో అజ్ఞాతంలో ఖైదీలా జీవితం గడుపుతున్నాడు. ఎవ్వరినీ కలవకూడదు. ఇంటి బయట అడుగుపెట్టకూడదు. అందుకే 'ఉజ్డే దయార్' అన్నాడు. అప్పటికే బర్మాను కూడా బ్రిటీష్ వారు అంచెలంచెలుగా తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఇది బహదూర్ షా జాఫర్‌కు తెలుసు. అందుకే ఇక్కడ తనకు నచ్చటం లేదని అంటూ 'అలం – ఎ – నా పాఎదార్ ' అన్న పదం వాడాడు. 'ఆలం – ఎ – నా పాఎదార్ ' అంటే క్షణభంగురమైన ప్రపంచం. ఈ క్షణ భంగురమైన ప్రపంచం ఎవరిదీ కాదు. ఇక్కడ ఏదీ ఎవరిదీ కాదు. అందుకే ఎవరిదీ కాని ఈ ప్రపంచంలో ఉండబుద్ధి కావటం లేదంటున్నాడు.

హిందీ సినిమాలపై 'ఉర్దూ' కవితల ప్రభావం అధికంగా కనిపిస్తుంది. హిందీ సినిమాలలో గేయ రచయితలు పలు సందర్భాలలో పాత తరం కవుల గేయాలలోంచి వాక్యాలను ఆధారంగా చేసుకుని పాటలు రచించారు. పలు సందర్భాలలో పేరు పొందిన కవితలను సినిమాలలో పాటల రూపంలో వాడుకున్నారు. బహదూర్ షా జాఫర్ ప్రధాన పాత్రగా కల సినిమా కాబట్టి ఆయన రాసిన కవితలను వాడుకోవటం స్వాభావికం. కానీ పలు సందర్భాలలో సందర్భం లేకున్నా, ఏదో ఓ రూపంలో పేరుపొందిన ఉర్దూ షాయరీని పాటలలో ప్రదర్శించారు.

సుల్తానుల పాలన ఆరంభమయిన కొన్నేళ్ళు పర్శియన్ భాష రాజ భాషగా వుంది. కానీ, జన బాహుళ్యంలోంచి ఉద్భవించిన ఉర్దూ భాష ప్రజల భాషగా ఎదిగింది. హిందీ, పర్శియన్ భాషల కలయికతో ఏర్పడిన ఈ భాషను రేఖ్తా లేక ఉర్దూ అంటారు. గజల్ అన్నది ఇరాన్ లో పదవ శతాబ్దంలో అరబ్బులనుంచి అందిన ఖాసిదా నుంచి ఏర్పడింది. ఖాసిదా అన్నది రాజును పొగడుతూ రాసే కవిత లాంటిది. దానిలో భాగమయిన తశ్బిబ్ రాను రాను ఖాసిదా నుంచి వేరుపడి గజల్ గా అభివృద్ధి చెందింది. పన్నెండవ శతాబ్దంలో గజల్ భారత్ లో అడుగుపెట్టింది. ఇరాన్ సాహిత్యం, కవిత్వం మొగలులతో పాటూ భారత్ చేరాయి. అమీర్ ఖుస్రూ ను గజల్ ను మన దేశంలో ప్రవేశపెట్టిన వాడిగా భావిస్తారు. కానీ, గజల్ అభివృద్ధి చెందింది దక్షిణ భారత దేశంలో. గోల్కొండా, బీజాపూర్ సుల్తానులు గజల్ ను ఆదరించారు. ఖులీ ఖుతుబ్ శాహ్ పెర్శియన్ హిందీల కలగలుపుతో ఉర్దూలో యాభైవేలపైగా గజల్ లు రచించాడు. ఇలా, దక్షిణాన ప్రాచుర్యం పొందిన గజల్ వలి దెక్కనీ ద్వారా ఉత్తర భారతం చేరింది. పద్దెనిమిది, పంతొమ్మిది శతాబ్దాలను గజల్ కు స్వర్ణయుగంలా భావిస్తారు. సౌదా, దర్ద్, గాలిబ్, మొమిన్, జౌక్, జఫర్ వంటివారు గజల్ ను ఉచ్చస్థాయికి

తీసుకువెళ్ళారు. ప్రథమ స్వతంత్ర సంగ్రామం తరువాత డిల్లీ బ్రిటీష్ వారి వశమవటంతో ఉర్దూ కవులంతా లక్నో చేరారు. వాజిద్ అలీ శాహ్ ఓటమి తరువాత నిజామ్ దగ్గర్ ఆశ్రయం పొందారు. స్వతంత్ర సాధనతో  దేశ విభజన ఉర్దూను తీవ్రంగా దెబ్బ తీసింది. ముస్లీముల దేశంగా ఎదిగిన పాకిస్తాన్ ఉర్దూ ను ప్రధాన భాషగా స్వీకరించటంతో భారత దేశంలో ప్రజల భాషగా జనించిన ఉర్దూ కేవలం ముస్లీముల భాషగా గుర్తింపు పొందింది. మన దేశంలో ఉర్దూ ప్రాధాన్యం తగ్గింది. కానీ, స్వతంత్రం వచ్చిన కాలంలో, అంతకుముందూ కూడా సినిమాలలో కళాకారులు అధికంగా ఉర్దూ తెలిసినవారు. పేరుకు హిందీ సినిమాలే అయినా ఉర్దూ వాడకం అధికంగా వుండేది.

హిందీ సినీ గీతాలలో మీర్జా గాలిబ్ కవితల వాడకం అధికంగా కనిపిస్తుంది. 'మీర్జా గాలిబ్ ప్రధాన పాత్రగాకల సినిమాలో గాలిబ్ గజళ్లను వాడటంలో ఆశ్చర్యంలేదు. కానీ గాలిబ్ కవితలలోని పంక్తులను సినిమా పాటలలో వాడుకోవటమే కాదు, సినిమా పేర్లలో కూడా వాడుకున్నారు .ఈ సినిమాలకు గాలిబ్‌కూ ఏమీ సంబంధం లేదు.

'ఇష్క్ పర్ జోర్ నహీ' అన్న సినిమాలో 'సబ్ కహ్‌తీ  హై దునియా, ఇష్క్ పర్ జోర్ నహీ' అన్న పాట లతా మంగేష్కర్ పాడుతుంది. పలు సినిమాలలో 'ఈ ఇష్క్ పర్ జోర్ నహీ' అంటే 'ప్రేమపై ఎలాంటి ఒత్తిడి పనిచేయదు' లేక 'ప్రేమ ఎలాంటి ఒత్తిళ్లకు లొంగదు' అన్న వాక్యాన్ని వాడుకోవటం కనిపిస్తుంది. 'ఏప్రిల్ ఫూల్' సినిమాలో రఫీ, సుమన్ కళ్యాణ్‌పుర్‌లు శంకర్ జై కిషన్ సంగీత దర్శకత్వంలో  హస్రత్ జైపురి రాసిన యుగళగీతం పాడారు.

**'కహదో కహదో జహాన్ సే కహదో**

**ఇష్క్ పర్ జోర్ నహీ '**

ప్రేమ ఎలాంటి ఒత్తిళ్లకూ లొంగదని ప్రేయసీ ప్రియుడు పాడుతున్నారు. ఈ 'ఇష్క్ పర్ జోర్  నహీ' అన్నది గాలిబ్ రాసిన షేర్‌లో ఓ పాదం.

**ఇష్క్ పర్ జోర్ నహీ హై యే వో ఆతిష్ గాలిబ్**

**కి లగయే న లగే ఔర్ బుఝాయే న బుఝే.**

ప్రేమపై ఎలాంటి ఒత్తిళ్లు పని చేయవు. ప్రేమ ఎలాంటి అగ్ని అంటే అది కావాలని మండిస్తే మండేది కాదు. ఆర్పాలనుకుంటే ఆరేదికాదు.

మహమ్మద్ ఇక్బాల్ రాసిన 'సారే జహాసె అచ్చా, హిందుస్తాన్ హమారా ' 'తరానా ఎ హింద్' అనే గేయాన్ని 'భాయ్ బహెన్' అన్న సినిమాలో ఆశాభోన్స్లే అందంగా పాడింది. అయితే ఇక్బాల్ పాకిస్తాన్‌ను సమర్థించటం ప్రారంభించిన తరువాత ఇదే కవితను మార్చి రాశాడు.

**చీన్ – ఓ– అరబ్ హమారా, హిందూస్తాన్ హమారా**

**ముస్లిం హై హం వతన్ హై సారా జహాన్ హమారా.**

'చైనా అరబ్ మావే. హిందుస్తాన్ మాదే. మేము ముస్లిములము. ప్రపంచమే మాది' అన్న ఈ కవితను పారడీ చేస్తూ 'ఫిర్ సుబహ హోగీ' అన్న సినిమాలో సాహిర్ లూధియాన్వీ ఓ పాట రాశాడు.

**చీన్ – ఓ – అరబ్ హమారా, హిందుస్తాన్ హమారా**

**రహానే కో ఘర్ నహీహై. సారా జహాన్ హమారా.**

చైనా, అరబ్‌లు మావే. హిందుస్తాన్ మాదే. ఉండటానికి ఇల్లులేదు. ప్రపంచం మొత్తం మాదే. సాహిర్ విసిరిన ఈ వ్యంగ్య బాణం తగలాల్సిన వారికి తగలాల్సిన చోటే తగిలింది. ఓ వైపు పాటలో దేశభక్తిని ప్రదర్శిస్తూనే నిరుద్యోగ సమస్య, పేదరికం వంటి వాటిని వ్యంగ్యంగా ప్రస్తావించాడు సాహిర్.

గమనిస్తే, హిందీ సినిమాలలో ఉర్దూ వాడకం మూడు దశలలో కనిపిస్తుంది. ఆరంభంలో క్లాసికల్ కవులుగా గుర్తింపు పొందిన కవుల షేర్ షాయరీలు వాడేవారు. గాలిబ్, ఫైజ్ అహ్మద్ ఫైజ్, అమీర్ ఖుస్రో, మీర్ తకీ మీర్, బహదుర్ షా జాఫర్, హస్రత్ మోహనీ, వాజిద్ అలీ షాహ వంటి వారి కవితలను ఆరంభంలో అధికంగా వాడేవారు. ఆంగ్లేయుల పాలనలో ఉన్నాసరే, పలువురు ఉర్దూ ప్రధాన భాషగా విద్యావంతులవటంతో ఉర్దూ వాడకం అధికంగా ఉండేది. 1938లో 'స్ట్రీట్ సింగర్' అన్న సినిమాలో సైగల్ 'బాబుల్ మోరా' అంటూ వీధుల్లో హార్మోనియం వాయిస్తూ ఓ మధుర గీతం పాడాడు.

**బాబుల్ మొరా నైహర ఛూటోజాయె**

విషాదం ఉట్టిపడే స్వరంలో పుట్టింటికి దూరమౌతున్న వధువు వేదనను పాటలోని ప్రతిపదంలో ప్రదర్శించాడు సైగల్. ఈనాటికీ ఓ 'బాబుల్ మొరా ' పాట సజీవంగా ఉంటూ శ్రోతలను అలరిస్తోంది. 'ఇదే బాబుల్ మెరా'ను జగ్ జిత్

సింగ్, చిత్రాసింగ్‌లు 'ఆవిష్కార్ ' (1973) సినిమాలో పాడారు. 2017లో పూమా; కరేజ్ హాస్ నో లిమిట్స్ సినిమాలో అర్జిత్ సింగ్ ఇదే 'బాబుల్ మోరా 'ను పాడేడు.

ఈ బాబుల్ మోరా పాటను రాసింది అవధ్ నవాబు 'వాజిద్ అలీ షాహ'. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా విప్లవం లేవదీసినందుకు ఆయనను లక్నోనుంచి కలకత్తా పంపి, అక్కడ బంధించారు. తన ప్రియమైన లక్నోను పుట్టింటిగా భావించి పుట్టింటికి దూరమౌతున్న వధువు వేదనలో, లక్నోకు దూరమౌతున్న తన వేదనను ఆరోపించి రచించిన 'ఠుమ్రి ' ఇది. భైరవి రాగాన్ని నేర్చుకునేవారు ముందుగా ఈ గీతాన్ని నేర్చుకుంటారు. ఇలా వాజిద్ అలీ షాహ గీతం, సినిమా పాటద్వారా జనబాహుళ్యంలో ప్రచారానికి వచ్చింది.

కొన్నాళ్లకి నిజజీవితంలో కవులైన సాహిర్, శైలేంద్ర, హస్రత్, మజ్రూహ్, కైఫీ ఆజ్మీ వంటివారు రంగ ప్రవేశం చేశారు. వీరు పాతకవుల కవితలలోని పంక్తులను ఆధారం చేసుకుని సినీ సందర్భానికి తగ్గట్టు పాటలను రచించారు. తద్వారా క్లాసిక్ కవుల కవితలను సామాన్య ప్రజల పెదవులపై ఉంచారీ కవులు. వీరు రాసిన కవితలు కూడా సినిమా పాటలుగా ఎదిగి ప్రజలను ఉర్రూతలూగించాయి.

ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన 'దోనో జహాన్ తేరీ మొహబ్బత్ మే హార్ కే అన్న గజల్ ను 'రోమియో జూలియట్ ' అన్న సినిమాలో వాడారు. హుస్న లాల్ భగత్ రాం సంగీత దర్శకత్వంలో జోహ్రాబాయ్ అంబాలేవాలీ పాడిందీ పాటను. ఫైజ్ రాసిన కొన్ని ప్రేమ కవితలను కలిపి 'జాన్‌వర్' సినిమాలో నాయికా నాయకుల నడుమ రొమాంటిక్ సంభాషణగా రఫీ, లతాలతో పాడించారు శంకర్ జై కిషన్.

మైనె రఖాహై మొహబ్బత్ అప్నె అఫ్సానేకా నామ్

తుంభీ కుచ్ అచ్చాసారఖ్ దో అప్నె దీవానే కా నామ్

'షబ్నం' (1964) అన్న సినిమాలో జావేద్ అన్వర్ రాసిన పాట ఇది. మహమ్మద్ రఫీ ఎంతో అద్భుతంగా పాడిన ఈ పాట మహమూద్ పై చిత్రితమయింది. కానీ ఈ పాట పల్లవికి మూలం ఫైజ్ కవిత.

హమ్ సె కహతే హై చమన్ వాలే గరీబాన్ – ఏ – చమన్

తుం కోయీ అచ్చాసా రఖ్‌దో అప్నే వీరానే కా నామ్

ఇజ్జత్ (1968) సినిమాలో సాహిర్ రాసిన పాట 'యే దిల్ తుం బిన్ కహీన్  లగ్తానహీ హం క్యాకరే' ఈనాటికీ ఎంతో ప్రజాదరణ ఉన్న యుగళగీతం. ఈ పాటలో ఓ చరణంలో నాయకుడు 'హజారో గం హై ఇస్ దునియామే అప్నే భీ పరాయేభీ,  మొహబ్బత్ కా  హీ గమ్  తన్ హా నహీ హం క్యా కరే ' అంటాడు. ఈ ప్రపంచంలో ఎన్నో దుఃఖాలున్నాయి, మనవాళ్లవీ, వేరే వాళ్లవీ. ప్రేమ వేదన ఒక్కటే వేదన కాదీ ప్రపంచంలో అంటాడు నాయకుడు,  ప్రేమ వేదనను ప్రకటిస్తున్న నాయకతో. ఈ పంక్తులకు మూలం  ఫైజ్ కవితలో లభిస్తుంది .'ఔర్ భి దుఖ్ హై జమానే మే, మొహబ్బత్ కె సివా ; అంటాడు ఫైజ్.

ఇలా ఒక కవి కవితలోని కొన్ని పంక్తులనో, భావాన్నో తీసుకుని తిరగరాయటాన్ని  ఉర్దూ సాహిత్యంలో  'కాపీ' అనరు. 'తజ్మేన్' అంటారు. తజ్మేన్ అంటే ఒక కవి తనకు ప్రేరణ నిచ్చాడని ప్రకటిస్తూ  ఆ కవికి గౌరవం ప్రకటించటం అన్నమాట.

**తేరి ఆఖోంకె సివా దునియామే రఖాక్యాహై**

**యే ఉఠే సుబహ చలే, యే ఝుకే  షాం ఢలే**

**మేర జీనా, మేర మర్నా  ఇన్ హి పల్కోంకె తలే**

'చిరాగ్' సినిమా అనగానే గుర్తుకు వచ్చేపాట ఇది. మహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్‌లు విడివిడిగా పోటీ పడి పాడిన పాట ఇది. సంగీత దర్శకుడు మదన్ మోహన్ సాహిత్య ప్రియుడు. ఆయనకు ఫైజ్ కవితలు అంటే ఇష్టం. ముఖ్యంగా ఫైజ్ రాసిన 'నక్ష – ఎ– ఫిర్యాదీ ' అన్న కవితల సంకలనంలోని '**ముఝ్సే  పహలీ  సి మొహబ్బత్ మేరీ మహబూబ్ న మాంగ్** ' అన్న కవిత చాలా ఇష్టం.

**ముఝ్‌సే పహ్లీసి మొహబ్బత్ మేరీ మహబూబ్ న మాంగ్**

**మైనే సంఝూ థా  కి  తు హై తొ దరఖ్షాన్ హై హయాత్**

**తేరా గం హైతొ గమ్ - ఎ – దాహ్ర్ క ఝుగ్డా క్యా  హై**

**తేరి సూరత్ సేహై అలం మె బహారోం కో సబాత్**

**తేరి ఆంఖోంకె సివా దునియా మె రఖా క్యాహై**

ఈ కవితలోని పాదం 'తేరి ఆంఖోం కె సివా దునియామే రఖా క్యాహై ' అన్న పదంతో పాటను ఆరంభించాలని గేయ రచయిత మజ్రూహ్ సుల్తాన్ పురిని కోరారు. కానీ ఫైజ్ అనుమతిస్తేనే ఆ పని చేస్తానని మజ్రూహ్ షరతు విధించాడు. చివరికి ఫైజ్ అనుమతితోనే ఈ పాటను ఫైజ్ కవితలోని పంక్తులతో ఆరంభించాడు మజ్రూహ్.

ఫైజ్ కవితలు హిందీ సినీ కళాకారులపై ఎంతగా ప్రభావం చూపించాయంటే, మజ్దూర్ (1983) సినిమాలోని పాట 'హం మెహనత్ కకష్ ఇస్ దునియా సే', సితంగర్ (1985) సినిమాలో 'చంద్ రోజ్ ఔర్ మెరీజాన్, ఫకత్ చంద్ హి రోజ్ ' సికందర్ (2009) సినిమాలో 'గులోంమే రంగ్ భరే ' వంటి పాటల పల్లవులకు మూలం ఫైజ్ కవితలలో ఉంది. అలాగే 1942 – ఎ లవ్ స్టోరీలోని విషాదగీతం 'యే సఫర్ బహుత్ కఠిన్ హై మగర్' పాట ముందు వినిపించే కవిత ఫైజ్ రాసినదే.

**దిల్ న ఉమ్మీద్ తో నహీ నా కాం హీతో హై**

**లంబీ హై గం హై గం కీ షాం, మగర్ షాం హీతో హై**

ఇలా ఫైజ్ కవితలు హిందీ సినీ కళాకారులను ఎంతగానో ఆకర్షించాయి. ఫైజ్ పాకిస్తాన్ వెళ్ళిపోయినా సరే అతని కవితల ఆకర్షణ తగ్గలేదు. అయితే, సాహిర్, మజ్రూహ్ లాంటి కవుల తరువాత వచ్చిన తరం ఆనంద్ బక్షీ, గుల్జార్ వంటివారు కూడా ఉర్దూ భాషలో నిష్ణాతులు. దాంతో వారు కూడా తమ గేయాలకు ఉర్దూ కవుల కవితలను ఆలంబనగా వాడుకున్నారు.

మీర్ తకీ మీర్ కవితలలోని పంక్తులను పల్లవిగా తీసుకుని మజ్రూహ్ సుల్తాన్‌పురి, ఏక్ నజర్ (1981) సినిమాలో చక్కటి పాటను రచించాడు.

**పత్తా పత్తా బూటా బూటా హాల్ హమారా జానే హై**

**జానే న జానే గుల్ హీ న జానే బాగ్ తో సారా జానే హై**

లక్ష్మీ ప్యారే సంగీత దర్శకత్వంలో రఫీ, లతాలు అత్యంత రొమాంటిక్‌గా పాడిన ఈ పాటతో అమితాబ్, జయభాదురిల ప్రేమ ప్రారంభమయిందని అంటారు.

**సర్ఫరోషీకీ తమన్నా అబ్  హమారే దిల్ మె హై**

**దేఖ్ నా హై జోర్ కిత్నా బాజువే  ఖాతిల్ మే హై**

'షహీద్' సినిమాలో దేశభక్తిని ప్రేరేపించే గొప్ప పాట ఇది. 'సర్ఫరోష్ ' అంటే ప్రాణాలకు తెగించి పోరాడే ధైర్యం ప్రదర్శించాలన్న కోరిక, తిరుగుబాటు చేయాలన్న కోరిక హృదయంలో జనించిందన్నమాట. శత్రువు బాహువుల బలం ఎంతుందో తెలుసుకోవాలన్న కోరిక జనించిందన్నమాట. ఈ పాట భగత్‌సింగ్ జీవితం ఆధారంగా వచ్చిన సినిమాలన్నిటిలో  వాడారు. 1921లో బిస్మిల్  అజిమాబాది  అనే కవి ఈ గేయాన్ని రచించాడు. 'రాం ప్రసాద్ బిస్మిల్ ' ఈ పాటకు ప్రచారం కల్పించాడు. ఈ గేయాన్ని బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో యుద్ధ నినాదంలా మార్చాడు బిస్మిల్ రాం ప్రసాద్. కాకోరీ రైలు ఉదంతంలో అశ్ఫఖుల్లా  ఖాన్, రాజేంద్ర లహరిలతో పాటూ ఉరిశిక్షననుభవించాడు. ఆయన స్వయంగా కవి కావటంతో 'షహీద్' సినిమాలో ఈ గేయాన్ని బిస్మిల్ రాం ప్రసాద్ రచించాడని చూపారు. నిజానికి ఈ పాటను రచించింది బిస్మిల్ అజిమాబాదీ.

'మౌసం' సినిమాలో సూపర్ హిట్ పాట 'దిల్ ఢూండ్ తా హై ఫిర్ వహీ ఫుర్సత్ కే రాత్ దిన్ ' పాటను రచించింది గుల్జార్. ఈ పాట పల్లవికి మూలం గాలిబ్ రచించిన 'ముద్దత్ హుయీ  హై యార్ వో  మెహమాన్ కియె హువే' అన్న కవిత.

**జీ ఢూంఢ్‌తా హై ఫిర్ వహీ ఫుర్సత్ కే  రాత్ దిన్**

**బైఠే రహే తసవ్వుర్  – ఎ – జానాన్ కియే హువే.**

అతని హృదయం ఆ తీరిక రాత్రింబగళ్ళను వెతుకుతోందట. ఎలాంటి రాత్రి పగలంటే తీరికగా కూర్చుని ప్రేయసిని ఊహిస్తూండిపోయిన రోజులను హృదయం అన్వేషిస్తున్నదట. ఈ కవితలో  'జీ'ని  సమానార్ధకమైన పదం 'దిల్ ' తో  మార్చాడు గుల్జార్. పాటకు పల్లవిగా వాడుకున్నాడు.

హిందీ సినిమాలలో వాడిన అనేక ఖవ్వాలీ పాటలకు ప్రేరణ సూఫీ కవి అమీర్ ఖుస్రూ వద్ద లభిస్తుంది. ఈయన అధికంగా పర్షియన్, హిందీ భాషలలో గేయాలు, కవితలు రచించాడు .హిందూస్తానీ సంగీతంలోని ఖయాల్ గాయకీ కి బీజం వేసింది అమీర్ ఖుస్రో. గొప్ప సూఫీ కవిగా పేరు పొందిన ఈయన రచనలను  కూడా సినిమాల్లో వాడుకున్నారు.

1978లో విడుదలైన 'జూనూన్ ' సినిమా అమీర్ ఖుస్రూ కవితతోటే ఆరంభమవుతుంది.

**ఆజ్ రంగ్ హై...**

**కాహేకో  బియాహే బిదేస్**

**అరే లఖియా బాబుల్ మెరే**

**హం తోరే బాబుల్, చేమన్ కి  కలియాన్**

**ఘర్ ఘర్ మాంగే  హై జాయ్**

**'మై తులసీ తేరి అంగన్ సినిమాలో చాప్ తిలక్ సబ్ చీనీ రే  అంటూ పాడే  గజల్  రాసింది అమీర్ ఖుస్రో.**

**భాప్ తిలక్ సబ్ ఛీనీ  రే మోసే నైనా మిలాయ్ కే**

'నా కళ్లతో కళ్లు కలిపి నా సర్వం దోచుకున్నావు' అంటూ సాగే ఈ గజల్‌ను కొందరు ప్రేమ గీతంగా అభివర్ణిస్తే, మరికొందరు భగవంతుడి భావనలో సర్వం మరచి తన్మయమైన జీవుని భావంగా భావిస్తారు. ఈ గజల్‌ను పలువురు గాయకులు తమదైన పద్ధతిలో గానం చేశారు.

ఇక్కడ గమనించాల్సిందేమిటంటే, ఇలాంటి ప్రామాణికమైన  కవితలను సినిమాల్లో వాడటం ద్వారా ఆయా కవితలపట్ల ప్రజలలో అభిరుచి కలిగించటమే కాదు, ఉత్తమ ప్రామాణికమైన సాహిత్యానికి ప్రచారం కల్పించినట్లవుతుంది. కేవలం సాహిత్య ప్రపంచానికి పరిమితమయ్యే అనేక అత్యద్భుతమయిన కవితలు, భావాలు సామాన్య ప్రజల నాలుకలపై నడయాడే వీలును సినిమాల్లో ఇలాంటి పాటలు కలిగించాయి.

(వచ్చేనెల మరిన్ని మంచి పాటలతో కలుద్దాం.)

Click here to share your comments